


# జాలిలేని జాబిలి

## – కొమ్మూరి వేణుగోపాలరావు



తనకు కావలసింది వెదుక్కుంటూ ముందుకుపోవడమే మానవుని జీవితం. కాని తనకు కావలసిందేమిటోకూడా తెలియని అస్పష్టస్థితి.

రచయిత కావాలనుకున్నాడు - అయినాడు. డాక్టరు కావాలనుకున్నాడు - అయినాడు. పేరు ప్రఖ్యాతులు కావాలనుకున్నాడు - లభించినై.

కానీ అతనికి యేదో కావాలి. అతన్నెంతోమంది ఆరాధించారు. జీవితంలోకి ఎందరో సుందరీమణులు ప్రవేశించారు. అతని చుట్టూ ప్రేమ హృదయంలో ప్రేమ. కాని ఆ ప్రేమ అతన్ని స్పర్శించేదేగాని అదృష్టవంతుణ్ణి చేయలేదు.

యవనం వుంది - డబ్బు వుంది - కీర్తి వుంది - అంతా వున్నారు కాని...?

అతనిపట్ల జాబిలికి జాలిలేదు.

### *కొమ్మూరి రవికిరణ్ గారి ప్రత్యేక అనుమతితో*
### *అలనాటి అందమైన నవల పునర్ముద్రణ*
### (క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

**తన పర్మిషన్** లేకుండా కుటుంబంలోని వాళ్ళు ఏ పని అయినా ఎందుకు చెయ్యాలని ఆయన ఉద్దేశం. ఆ రాత్రి కొడుకుని పిలిచి "నువ్వురాసినవన్నీ ఇలా పట్రా" అన్నాడు.

తల్లి ముఖతః తండ్రికి తెలిసిన విషయం వినివుండటం చేత మధుబాబు ఉలిక్కిపడలేదుగాని తను కష్టపడి ప్రోగు చేసిన ఆస్తి అంతా తండ్రి చిన్నాభిన్నం చేసేస్తాడేమోనని గుండెల్లో రాయిపడ్డది. అచ్చుపడ్డ ప్రతి రచనా అందంగా కత్తిరించి, పదిలంగా ఫైలు చేస్తూండేవాడు. మారు మాట్లాడకుండా ఆ ఫైలు తీసుకొచ్చి తండ్రి ముందు పెట్టాడు. "రోజూ

రాస్తున్నావా?" అని అడిగడాయన గంభీరంగా. మధుబాబు లేదన్నట్లు తల ఊపాడు. "రోజూ రాయబోక, వారానికి ఓ రోజని పెట్టుకో. ఆదివారం పెట్టుకో. ఆరోజు తప్ప యిహ దాని ప్రమేయం జ్ఞాపకం వుంచుకోక. నెలకు ఒక్క కథ రాయి, అంతకంటే రాయబోక. ఇది నీ చదువుకు ఎంత మాత్రం ఆటంకం కాకూడదు. తెలిసిందా? చదువు, చదువు. దాని తర్వాతనే యివన్నీ."

కొంచె ఆగి మళ్ళీ తనే "నువ్వు నా పెద్ద కొడుకువి. త్వరలో నా చేతికి అందిరావల్సిన వాడివి. నువ్వు ఏ మాత్రం తప్పటడుగు వేసినా నా గుండె కళుక్కుమంటుంది. నీకు నేను కలిగించిన సౌకర్యాలు, నా చిన్నప్పుడు మా నాన్న ఒక్కటీ కలుగచెయ్యలేదు. అసలు నా ఊసే పట్టించుకోలేదు, ఎన్నో కష్టాలుపడి పై వచ్చాను. నేను సెల్ఫ్‌మేడ్ మేన్‌ని. నీకు ఏది కావాలంటే అది యిస్తున్నాను. ప్రత్యేకం ఓ గది ఏర్పాటు చేశాను, ఈ సదుపాయాలన్నీ నువ్వు సక్రమంగా వినియోగించుకోకపోతే..."

ఆయన కంఠం గాద్గిదికమై వొణికింది. "వెళ్ళు. వెళ్ళి చదువుకో."

మధుబాబు అక్కడినుంచి వచ్చేశాడు. అతని మనస్సు వికలమై పోయింది.

5

తనకేమైనా పేరు ప్రఖ్యాతులు వచ్చాయా అని మధుబాబు ఆలోచిస్తూ వుండేవాడు. తాను విన్న ప్రకారం ఈ రాసే వాళ్ళకు సంఘంలో గౌరవం, ప్రతిష్ట లభిస్తూ వుండాలి. అలాంటివేమయినా అమరుతున్నాయా తనకు? కాలేజీలా తనగురించి తరుచు ప్రసక్తి వస్తూంటుందని చూచాయగా విన్నాడు. అయితే వాళ్ళెవరూ బయటపడి తనని పొగడటం కాని, అలాంటిదింకేమయినా చెయ్యటంకాని జరగలేదు.

విశ్వనాథంగారి స్నేహితులు తరుచు చదువుతూండేవాళ్ళు. తమ అభిప్రాయాలు సంభాషణాపరంగా ఆయన ముందు వ్యక్తపరుస్తూ వుండేవాళ్ళు. "ఏమిటయ్యా ఎప్పుడూ నీ బిజినెస్ గొడవేనా? కాస్త ప్రక్కకి కూడా దృష్టి మళ్ళించు. మీ అబ్బాయి బాగానే రాస్తున్నాడు" అనేవాళ్ళు.

"ఇవాళ తప్పకుండా చదువుతాను" అనుకునేవాడాయన. ఆ రాత్రి కాస్త ప్రయత్నం చేశాడు. కానీ ఒక్క పేజి అయినా పూర్తికాకుండానే అంతా గందరగోళంగా, ఏమిటోగా ఉండేది. కాయితాలు మూసేసి పడుకుని నిద్రపోయేవాడు.

మధుబాబు క్లాసులో సత్యనారాయణ అని ఓ అబ్బాయి వున్నాడు. ఇంచుమించు మధుబాబు యీడే వుంటుంది. క్లాసులో ఓ మూల వొంటరిగా కూర్చునేవాడు. ఎవరితోనూ ఎక్కువ మాట్లాడేవాడు కాదు.

ఓ రోజు సత్యనారాయణ మధుబాబు దగ్గరకొచ్చి "మా అన్నయ్యని కలుసుకుంటారా?" అన్నాడు.

మధుబాబు కొంచెం ఆశ్చర్యపడి "మీ అన్నయ్య ఎవరండీ?" అన్నాడు మృదువుగా.

"ఉమాపతి, కథలు రాసే ఉమాపతి."

మధుబాబు చప్పున భుజాలెగరేశాడు అప్పుడప్పుడూ పత్రికల్లో కనిపిస్తూవుండే ఉమాపతి యితని అన్నా?

"అన్నయ్యకూడా లాస్ట్ ఇయర్ నుంచే రాయటం మొదలుపెట్టాడు. మీరు నా క్లాస్‌మేటని చెప్పాను. మిమ్మల్ని కలుసుకుందామనుకుంటున్నాడు" అన్నాడు సత్యనారాయణ.

మధుబాబుకు చెప్పలేని ఆనందం కలిగింది. మొదటిసారిగా మరో రచయితని కలుసుకునే అవకాశం లభిస్తోంది.

"తప్పకుండా. ఇవేళ సాయంత్రం మీ ఇంటికి వెడదామా?" అన్నాడు ఉత్సాహంగా.

సత్యన్నారాయణ "ఇంటికి ఇవాళ వద్దండీ. వర్షాలు పడటం మూలాన దారి సరిగ్గా లేదు. సాయంత్రం అయిదుగంటలకు మేమిద్దరం కలసి మీ ఇంటికి వస్తాము" అన్నాడు.

"మా ఇల్లు తెలుసా మీకు?"

"ఆ! గాంధీనగర్‌లో ఉంది, లైబ్రరీకిపోయే దారిలో. రెండు మూడుసార్లు మీరు మేడమీద నిలబడి వుండగా లైబ్రరీకి పోతూ చూశాను."

మధుబాబు సంతోషించి "సాయంత్రం తప్పకుండా రండి. ఎదురుచూస్తూ వుంటాను" అన్నాడు.

సత్యనారాయణ వెళ్ళిపోయాడు.

ఉమాపతి రాసిన ప్రతి రచనా అతను చదువుతూనే ఉన్నాడు. అతను యీ రంగంలో తనకంటే కొంచెం ముందుగా ప్రవేశించాడు. కాని తను చేసినన్ని రచనలు అతను చేయలేదు. రాయటం ప్రారంభించి ఏడాది గడచినా అన్నీ కలిసి ఏడెనిమిదికంటే మించవు.

నాలుగున్నరకి కాలేజీనుంచి ఇంటికి వచ్చి బట్టలు మార్చుకుని, అయిదయేసరికి కిటికీలోంచి బయటకు చూస్తూ కూర్చున్నాడు. తను అతనితో మాట్లాడవలసిన విషయాల గురించి ఆలోచిస్తున్నాడు. చివరకు అయిదున్నర దాటుతూండగా వాళ్ళిద్దరూ వచ్చారు. ఉమాపతి కొంచెం ఇంచుమించు అతని తమ్ముడిలాగే వున్నాడు. జుట్టు కొంతభాగం కళ్ళమీదుగా ముందుకు పడుతోంది. పైజమా, లాల్చీ వేసుకున్నాడు. కళ్ళు నిశితమైన దృష్టితో, భావస్ఫోరకంగా వున్నాయి. చూడగానే రచయిత అనిపించేటట్లుగా వున్నాడు. మధుబాబుని చూస్తే ఎవ్వరూ రచయిత అనుకోవడానికి ఆస్కారం లేదు. అతను సన్నగా, పొడుగ్గా, ఎర్రగా, లేతగా వుంటాడు. అతని క్రాఫ్ ఉంగరాలుగాని, వంకెలుగాని తిరగలేదు. పైకి దువ్వుతాడు.

నమస్కారం చేసి ఇద్దర్నీ లోపలకు తీసుకుపోయి తన గదిలో కూర్చోపెట్టాడు.

"మిమ్మల్ని ఓ రకంగా నేను యెరుగుదును" అన్నాడు ఉమాపతి ఆసీనుడయినాక.

"ఎలా?"

"మనం ఇద్దరం ఒక స్కూల్లోనే చదివాం, ఫిఫ్త్‌ఫారం చదివే రోజుల్లో, ఇంకా డివిజన్స్ చెయ్యకముందు అందరికీ కలసి కామన్‌గా అటెండెన్స్ తీసుకుంటూ వుండేవాళ్ళు. ఓసారి అటెండెన్స్ పిలిచేటప్పుడు పరధ్యానంగా వుండటం చూసి నేనే ఇచ్చేసాను రెస్పాన్స్" అని నవ్వాడు ఉమాపతి.

"అయితే మనమిద్దరం క్లాస్మేట్సుమా?" అన్నాడు మధుబాబు ఆశ్చర్యంగా.

"కొంతవరకూ. కొంతకాలం ఇక్కడ చదివాక కలకత్తాలో మా పెదనాన్నగారి దగ్గరకు వెళ్ళిపోయాను, స్కూల్ ఫైనల్ తప్పాను. ఇంక చదవబుద్ధి కాలేదు. చదువుకి తిలోదకాలిచ్చేశాను. మా తమ్ముడికీ నాకూ వయస్సులో ఏడాదికంటే తేడాలేదు. వాడు ప్రయివేటుగా మెట్రిక్ కట్టి కాలేజీలో చేరాడు.

"మరి ప్రస్తుతం మీరేం చేస్తున్నారు?"

"ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాను."

మధుబాబు లోపల్నుంచి కాఫీలు తీసుకువచ్చాడు. కాఫీలు త్రాగుతూ వాళ్ళు మామూలు విషయాలు యదాలాపంగా మాటలాడుతున్నారు.

"మీరు చాలా కథలు రాశారనుకుంటాను" అన్నాడు ఉమాపతి మొదలుపెడ్తూ.

"ఔనండీ ఓ పాతిక వరకూ రాశాను. ఒక్క భారతి మినహాయించి, ఇంచు మించు అన్నిట్లోనూ అచ్చయినాయి."

"అంత త్వరగా ఎలా వ్రాయగలుగుతున్నారు"

మధుబాబుకి అర్ధంకాలేదు "అంటే?"

"అంత ఎక్కువగా ఎట్లా ఉత్పత్తి చేయగలుగుతున్నారు? శ్రమ అనిపించటం లేదూ మీకు?"

ఈ మాట మదుబాబుకి చాలా కొత్తగా అనిపించింది. "శ్రమ" అని యెప్పుడూ అనుకోలా. ఏదో ఇతివృత్తం తట్టడం, రాసి పంపించేయటం అంతే" అన్నాడు.

"మీరు ఒకసారి రాసింది మళ్ళీ ఫెయిర్ చేస్తారా?"

"చెయ్యను. నిజం చెప్పాలంటే రాసింది చదువుకొనటానిక్కూడా నాకు ఓపిక వుండదు. అచ్చులో వస్తే చదువుకొనటమే"

ఉమాపతి యీ మాటలకు బాగా ఆశ్చర్యపడినట్లు కనిపించాడు. "ఓ కథ రాసేముందు మనసులో తర్జన భర్జన, విమర్శ, యోగ్యత ఇవన్నీ ఆలోచించుకోరా?" అన్నాడు కొంచె ఆగి.

"ఉహూ" అన్నాడు మధుబాబు.

"అసలు మీ ఆశయం ఏమిటి?" అన్నాడు ఆ రచయిత వున్నట్టుండి.

మధుబాబు ఉలిక్కిపడ్డాడు. ప్రశ్న తూణీరంలా వచ్చింది. సరి కొత్తది, యిదివరకు ఎన్నడూ విని యెరుగనిది. ఏమిటి తన ఆశయం? ఏముంది? అయోమయంగా చూశాడు పృచ్ఛకుని వంక.

"చెప్పండి" అన్నట్లు అతను గ్రుచ్చి గ్రుచ్చి చూశాడు.

మధుబాబు గబగబా ఆలోచిస్తున్నాడు. ఇంతవరకు తాను రాసిన కథలన్నీ మననం చేసుకుంటున్నాడు.

"ఇంతవరకూ పాతిక కథలు రాశారు. అన్నిట్లోనూ ఏదో చెప్పాలని ప్రయత్నించారు. కొత్త కొత్త పాత్రల్ని సృష్టించారు. కొంత వరకు మీ అభిప్రాయాల్ని నేను వూహించగలను. కానీ కలిశారు కాబట్టి ముఖత వినాలని వుంది. ఏమిటి కలం చేపట్టటంలో మీ ఆశయం?"

అబ్బ పెద్ద పెద్ద డైలాగులు దొర్లుతున్నాయి. కానీ ఏమి సమాధానం చెపుతాడు తాను? తనకేమీ ఆశయం లేదు. ఆశయం కోసం యింత వరకూ రాయలేదు. కథను మొదటి అక్షరం నుంచీ చివరి అక్షరం వరకూ ఏవో పాత్రలతో వూహించి రాశాడు అంతే.

"మీ రచనల ద్వారా సమాజానికి మీరివ్వదలచుకున్న సందేశమేమిటి?"

అయ్యబాబోయ్ ఏమిటి ఈ ప్రయోగాలు తనమీద? సమాజాన్ని సంస్కరించాల్సిన బాధ్యత తనకు వుందా? దానికి ఓ సందేశాన్ని వినిపించలసిన అవసరం తనకు కలదా? ఐతే రాయటానికి ఓ ప్రయోజనం, లక్ష్యసిద్ధీ వుండాలన్న మాట.

"నాకేమీ ఆశయాలు లేవండీ" అన్నాడు నవ్వటానికి ప్రయత్నిస్తూ.

జవాబు విని ఉమాపతి విస్తుపోయాడు. అతనికి ఈ ధోరణి విచిత్రంగా కనిపించింది. ఇలా అన్నాడు "ప్రపంచానికి మనం ఎలుగెత్తి చెప్పదలచుకున్నది లేనినాడు కాయితాన్ని ఖరాబు చేయటం శుద్ధ దండగ. అసలు ఏదో దుగ్ధ. తీరని తపన మనసులో జనించి, ఆ తాపాన్ని తీర్చుకోవటానికి కలం పడితేనే అతడు నిజమైన రచయిత. ఆశయంలేని వాడంటూ ఎవడూ వుండడు. అయితే కొందరికి నిర్దుష్టమయిన అభిప్రాయాలుండవు. వయసూ అనుభవం ఆ నిర్దుష్టత కలిగిస్తాయి.

"మరి నాకు లేదంతే" అన్నాడు మధుబాబు నీరసం క్రమ్మినట్లు.

ఉమాపతి మందహాసం చేశాడు. "మీ రచనలు చదివితే అట్లా అనిపించదే. వాటిలో అభూత కల్పనలు ఏమీ వుండటం లేదు. మన చుట్టూ రగులుతున్న సమస్యల్నే చిత్రిస్తున్నారు. మిమ్మల్ని గురించి మీకు సరయిన అభిప్రాయం లేదు. మీలో అవ్యక్తమయిన ఆరాటం వుంది" అన్నాడు.

మధుబాబుకు అబద్ధం చెప్పాలనిపించలేదు. "రెండు చేతులా రాయాలన్న ఆరాటం తప్ప ప్రపంచాన్ని గురించి మరో ధ్యాస లేదు. నేను కావాలని యింతవరకూ ఏ సమస్యనూ తీసుకోలేదు. ఆదర్శాలు విరజిమ్మాలనీ ప్రయత్నించలేదు. నా ఆనందం కోసం, తృప్తికోసం, రాసుకున్నానంతే" అన్నాడు.

"అలాకాదు చూడండి" అన్నాడు ఉమాపతి.

"ఒక నిర్దుష్టమయిన గమ్యం లేకుండా ఎవడూ ఉత్తమ రచయిత కాలేదు. మీ అభిమాన రచయితలంటూ ఎవరయినా వున్నారా?"

"శరత్.."

"శరత్‌ని మీరెందుకు అభిమానిస్తున్నారు?"

మధుబాబు ఆలోచించసాగాడు.

"ఆయన వ్రాసే ప్రతి ఆలోచనలోనూ యీ సమాజంలోని కఠిన నియమాలకూ, మూర్ఖపు దురాచారాలకూ బలయిపోతున్న అభాగ్యుల ఆక్రందన పౌరుషంగా వినిపిస్తుంది. ఆ నిర్భాగ్యుల్ని వివిధ కోణాలలో చిత్రించాడు. తన ఆశయ నిర్వహణకు యీ సమాజాన్నే ఒక విలన్‌గా తీసుకున్నాడు. సాధారణంగా ఆయన పుస్తకాల్లో విలన్‌లు వుండరు. సంఘాన్ని పాలిస్తున్న దారుణ సిద్దాంతాలకు గుర్రై, బలయిపోతుంటాయి పాత్రలు, తను చెప్పదలచుకున్న విషయాన్ని బట్టి దానికి అనుగుణ్యమైన భాషా, వాతావరణం శిల్పం తీసుకున్నాడు. రాసిన ప్రతి అక్షరంలోనూ తను గోచరిస్తూ వుంటాడు. అతని ఆశయమూ, దాని ఆచరణ విధానమూ రెండూ ఉదాత్తాలయినాయి ఏదీ ఏవగింపు కలగచెయ్యకుండా. అంచేతనే అతను న్లిచాడు. కొందరు శరత్‌ని పిరికి, స్పష్టంగా ముగించడు అని విమర్శిస్తూ వుంటారు. ఇట్లా విమర్శించేవాళ్ళు తాము వాంఛించిన సంఘాన్ని. అప్పుడే ఏర్పడిపోయినట్లు చిత్రిస్తున్నారు. వీటిలో కసేగాని కరుణలేదు.. మనుషుల్ని ఊహకతీతమైన స్థితిలో పెట్టటానికి ప్రయత్నించారు. అదీగాక సమస్యనుబట్టే భాష, అన్న సంప్రదాయాన్ని విచ్చలవిడిగా వాడుతున్నారు. వాస్తవికతకు విపరీత అర్థాలు తీసి సాహిత్యాన్ని రసహీనం చేసి, వొట్టి పొడిగా తయారు చేశారు. అంచేతే ఎంత ఆర్భాటం చేసినా శరత్ హృదయాలను ఆకర్షించినట్లు ఆకర్షించలేకపోయారు. మనకు సమాజం పట్ల వున్న కసిని వికృతంగా తీర్చుకోకూడదు. అదికాక విజాతీయ ఉద్రేకం ఎరువు తెచ్చుకోకూడదు. మన సాహిత్యాన్ని వెయ్యిమంది దుర్భాషలాడితే వాళ్ళెవరూ చేరుకోలేని ఉన్నత శిఖరాలను చేరుకున్నాననుకోవటం ప్రగల్భం."

ఎక్కడా తడుములాట లేకుండా, స్వచ్ఛమైన కంఠస్వరంలో చెప్పాడు ఉమాపతి. ప్రక్కన నిశ్శబ్దంగా కూర్చున్న అతని తమ్ముడు సత్యనారాయణకూడా శ్రద్ధగా ఆలకించాడు. శరత్‌ని గురించి నేను ఇలా మాటలాడగలనా అని ప్రశ్న వేసుకున్నాడు మధుబాబు. అతనికి ఆశ్చర్యంగా వుంది.

"శైలీ, శిల్పం వీటిగురించి మీకున్న నమ్మకాలేమిటి? అవి వాస్తవికతకు ఎంతవరకూ ప్రతిబంధకాలౌతాయి?" అన్నాడు ఉమాపతి ఒక్క నిముషం ఆగి.

ఇతర రచనలు చదువుతున్నప్పుడు యీ చెప్పబడిన వాటిలోని ప్రత్యేకత, సమర్థత మధుబాబుని ఆకర్షిస్తూ వచ్చాయి, క్కొక్క రచయిత రచనా విధానంలో ఒక్కొక్క విశిష్టత ఉంటుందని అతనికి తెలుసు.

"శైలి, శిల్పం లేకుండా సూటిగా చెపితే చాలా డ్రైగా, వొట్టి పిందెల్లా వుంటాయి" అన్నాడు జవాబు చెప్పాలి గనుక.

"సూటిగా చెప్పటం కూడా ఓ శైలే" అనాడు ఉమాపతి నవ్వుతూ.

మధుబాబు ఇబ్బందిలోపడి "నేను అలాంటివాటికోసం ఏమీ సాధనం చెయ్యలేదండీ" అన్నాడు.

"చెయ్యనక్కరలేదు నిజానికి. నిజమైన వ్యక్తిత్వం ప్రత్యేకమైన శైలిని సృష్టిస్తుంది. ఉదాహరణకు మిమ్మల్నే తీసుకుందాం. అజ్ఞాతంగా చాలామంది రచయితల ప్రభావం మీమీద ప్రసరిస్తున్నా కథను మలచటంలోనూ, సంభాషణలను పలికిచటంలోనూ మీది చిత్రమైన పద్దతి. ఓ సుకుమారత్వం వుంది అందులో. పాఠకుల్ని చాలా చప్పున ఆకర్షిస్తుంది. అయితే ఇంకా నిశితమైన నిర్దుష్టత రాలేదనుకోండి. రాసే సమయంలో ఇతర రచయితల గురించి మరిచిపోయి. మిమ్మల్నే కళ్ళముందు వుంచుకుంటే చెక్కుచెదరని శైలి అమరుతుంది. కాని మీ టెక్నిక్ మెచ్చుకోదగ్గది సుమండీ."

మళ్ళీ ఓ కొత్త పదం.

"సమస్యను తీసుకుని కథ అల్లుకోక ఆలోచించటమే ఇతివృత్తంలోని మొదటి సంఘటంతో ప్రారంభించటం వల్ల యీ టెక్నిక్ గొప్పగా కుదిరింది. మొట్టమొదట మీకు కథలోని మొదటి వాక్యమో, దృశ్యమో మనసులో మెదుల్తుంది. దాన్నిబట్టి మిగతా కథ అంతా చరచరమని సంఘటనలతో సాక్షాత్కరిస్తుంది. అప్పుడు మీరు రాయటానికి కొంచెంకూడా తడుముకోవల్సిన అవసరం ఉండదు."

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments